క్లుప్తంగా

ఘనంగా అక్షరాభ్యాసం



చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

ఆదోని అర్బన్: స్థానిక శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలయంలో ఆలయ ధర్మకర్త రాయచోటి రామయ్య ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దాదాపు 150 మంది చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మాట్లాడుతూ నిర్జల ఏకాదశి రోజున మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలయంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టామని, ఈ సందర్భంగా పిల్లలకు సరస్వతీ కటాక్షం లభించాలని పూజలు చేసినట్లు చెప్పారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి : మండలంలోని చిర్తనకల్ గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు విజయభాస్కర్ సోదరి వివాహం శుక్రవారం జరిగింది. వేడుకకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే..అదే గ్రామంలో వీఆర్‌ఓ మారెన్న ఇద్దరి తమ్ముళ్ల వివాహాలకు కూడా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కోసిగి, మంత్రాలయం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బెట్టనగౌడ, భీమారెడ్డి, గ్రామ సర్పంచ్ ఈరన్న పాల్గొన్నారు.

పనికి తగ్గ వేతనమివ్వాలి



రిలే దీక్షకు మద్దతు తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

ఆదోని టౌన్: మున్సిపల్ ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్ ఎలక్ట్రీషియన్ వర్క్స్‌లో గత 15 నుంచి 20 సంవత్సరాలు పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పనికి తగిన వేతనం కల్పించాలని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే దీక్షలు చేపట్టారు. దీక్షకు మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్ మద్దతు తెలిపారు. జైభీమ్ నాయకులు బసాపురం ఎల్లప్ప, నకుల రాజు, కృష్ణమూర్తి, జగదీష్, వీరేష్, నాగరాజు, సిద్ధు పాల్గొన్నారు.

'మధ్యాహ్నం' రుచికరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రామ్మూర్తి

పెద్దకడబూరు : ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజన పథకాన్ని తినేలా నాణ్యంగా, రుచికరంగా ఉండేలా భోజనాన్ని అందించాలని ఎంఈఓ బి.రామ్మూర్తి సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై సీసీహెచ్ (కుక్ కమ్ హెల్పర్స్) ఒక్కరోజు శిక్షణ తరగతులు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌పీ ట్రైనర్స్‌గా నారాయణమ్మ, రామలక్ష్మి వంట ఏజెన్సీలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏ ఒక్కరు కూడా ఇంటినుంచి భోజనాన్ని తెచ్చుకోరాదన్నారు. సిబ్బంది కృష్ణమాచారి, సురేష్‌రెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్.జాకీర్‌హుసేన్

మంత్రాలయం రూరల్ : మహిళలు కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జాకీర్ హుసేన్ అన్నారు. శుక్రవారం మంత్రాలయంలోని సచివాలయం–3లో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..90 రోజుల శిక్షణ కార్యక్రమానికి మహిళలు 75 శాతం హాజరు ఉండాలన్నారు. శిక్షణలో తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. 75 శాతం హాజరు ఉన్న వారికి ప్రభుత్వం నుంచి కుట్టుమిషన్లు అందజేస్తామని చెప్పారు. శిక్షణలో మహిళలు నైపుణ్యం పొంది ఉపాధి పొందాలని సూచించారు. శిక్షణ అనంతరం నైపుణ్యం గల మహిళలకు కుట్టుమిషన్‌తో పాటు సర్టిఫికెట్లు అందిస్తామని వివరించారు.

బాడుగ భారమై.. తానే కాడెద్దై !



నేటి రైతన్నలకు వ్యవసాయం గుదిబండగా మారుతోంది. ఒక పక్క కూలీల ధరతోపాటు మరో పక్క కాడెద్దుల బాడుగ భారమవుతోంది. దీనికి తోడు పెట్టుబడులకు కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం అందడం లేదు. ఈక్రమంలో నందవరం మండలం పూలచింత గ్రామానికి చెందిన కౌలు రైతు శ్రీరాములు తానే కాడెద్దుగా మారాడు. మహిళ సాయంతో కంది విత్తుకు శ్రీకారం చుట్టాడు. – నందవరం

సాగులో నూతన విధానాలను పాటించండి



మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక

కోసిగి : ఖరీఫ్ పంటల సాగులో నూతన విధానాలను పాటించాలని బనవాసి కృషి విజ్ఞాన్ కేంద్రం హార్టికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో నిర్వహించారు. ఉల్లి, మిరప, వేరుశనగ, పత్తి తదితర పంటలు సాగుచేసే విధానంలో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరించామన్నారు. ఫలితాల ఆధారంగా పంటలను సాగుచేసుకొని మంచి దిగుబడులను పొందాలని చెప్పారు.శాస్త్రవేత్త భార్గవి, వివిధ గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



కిరణ్‌కుమార్, వీరేంద్ర, ఇమ్రాన్ బాషా, మనోజ్‌కుమార్, భాగ్యశ్రీ, మేఘన

పెద్దకడబూరు : ఎన్‌ఎంఎంఎస్ పరీక్షా ఫలితాల్లో ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. గత విద్యా సంవత్సరంలో 6వ తరగతి చదివిన విద్యార్థులు కిరణ్‌కుమార్, వీరేంద్ర, ఇమ్రాన్‌బాషా, మనోజ్‌కుమార్, భాగ్యశ్రీ, మేఘన పరీక్షలు రాశారు. వెలువడిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచారని ప్రధానోపాధ్యాయురాలు ఉమారాజేశ్వరి శుక్రవారం తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏటా రూ. 12వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్ అందజేస్తారని చెప్పారు.

సీనియర్ సిటిజన్‌లతో యోగాంధ్ర

ఆదోని రూరల్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 8వ తేదీన ఉదయం 7 గంటలకు సీనియర్ సిటీజన్‌ల ప్రత్యేకంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలి అభివృద్ధికి ఇది దోహద పడుతుందన్నారు. ప్రభుత్వ అధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థలు, యోగా గురువులు, సామాజిక కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించాలని కోరారు. అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపల్, ఎంపీడీఓ, వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు.

- **ఆదోని టౌన్:** స్థానిక ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం ఉదయం 7 గంటలకు జరగనున్న యోగాంధ్ర–2025 కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి పాల్గొంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటీజన్లతో కలిసి యోగాసనాలు వేస్తారన్నారు.

షైనింగ్ స్టార్ పురస్కారాలకు విద్యార్థుల ఎంపిక



ఎస్ఎండీ సోహెల్ సిద్దిక్

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని స్థానిక నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, ఏఓ జాకీర్ హుసేన్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పది ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ఎస్ఎండీ సోహెల్ సిద్దిక్, గణేష్, సిరి చందన, యం.హన్సికప్రియదర్శిని అవార్డులు ఎందుకోనున్నారన్నారు.

నీటిని క్లోరినేషన్ చేయాలి



గుడికల్ చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో తాగునీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్ల వద్ద క్రమం తప్పకుండా క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఎల్లెల్సీకి వస్తున్న నీటిని, గుడికల్ చెరువుతోపాటు పంప్‌హౌస్ వద్ద ఫిల్టర్ బెడ్లను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎల్లెల్సీ ద్వారా వచ్చిన నీటిని ఎస్ఎస్ ట్యాంక్ ద్వారా పంప్‌హౌస్‌లో ఫిల్టర్ చేసి పట్టణంలో మంచినీరు సరఫరా చేస్తున్నందున ప్రజలు తాగునీటికి ఉపయోగిస్తే కాచివడబోసి తాగాలని సూచించారు. అంతకుముందు పట్టణంలోని పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, సోమప్ప సర్కిల్‌లో అన్నక్యాంటీన్‌లో అల్పాహార పంపిణీని పరిశీలించారు. కమిషనర్ వెంట ఏఈ శరత్‌కుమార్ ఉన్నారు.

విత్తన శుద్ధితోనే అధిక దిగుబడులు

ఎమ్మిగనూరుటౌన్: విత్తన శుద్ధితోనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అధికారి హేమలత సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెసలదిన్నె రైతు సేవాకేంద్రంలో కేవీకే బనవాసి ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. పత్తి, ఉల్లి, మిరప పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై వివరించారు. కంది పంటలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక రకాల గురించి వివరించారు. పత్తి సాగులో సాలుకు సాలుకు మూడు అడుగుల దూరం పాటించాలని, మొక్క మొక్కకు మధ్య అడుగు దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. ఏఓ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ధ్రువీకరించిన నాణ్యమైన విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని సూచించారు. సదస్సులో ఆత్మ ఏటీఎం రామాంజనేయులు, కేవీకే శాస్త్ర వేత్త డాక్టర్ నిరంజన్‌రెడ్డి, ఏఈఓ రసూల్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



డ్రమ్ములోని నీటిని పారబోయిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి

గోనెగండ్ల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి సూచించారు. శుక్రవారం పుట్టపాశం గ్రామంలో మలేరియా, డెంగీ సర్వే, టీబీ వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. గ్రామంలో పర్యటించి డ్రమ్ములు, కుండలు, గచ్చులలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకుంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. డాక్టర్ కార్తీక్, సూపర్‌వైజర్లు హనుమంతు, పరమేష్, హెడ్ అండ్ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఈద్–ఉల్–జహ శుభాకాంక్షలు



బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక శుక్రవారం ఈద్–ఉల్–జహ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి, ధాతృత్వానికి, ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్‌ను ముస్లింలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు.

నకిలీలతో జాగ్రత్త!

- లైసెన్స్ ఉన్న దుకాణాల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లు చేయాలి
- అనుమానం వస్తే వ్యవసాయాధికారులను సంప్రదించాలి



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

గోనెగండ్ల: ఖరీఫ్‌లో వివిధ పంటలను సాగుచేస్తున్న రైతన్నలు ముందస్తుగా ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలోనే అనుమతులు లేని కంపెనీ విత్తనాలు, ఎరువులు మార్కెట్లోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గంలోని మండలంలో వివిధ ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయన్న సమాచారం జోరుగా సాగుతోంది. దీంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులను కోరుతున్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి అన్ని వివరాలను పరిశీలించిన తరువాత కొనుగోలు చేయాలి. విత్తనాలు ఎరువులు మందులు కొనుగోళ్లలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. లైసెన్స్ లేని దుకాణాలు, దళారులు ఇతరత్రా ఎక్కడబడితే అక్కడ కొనుగోలు చేయకూడదు. సరుకు లాట్ నంబరు, తయారీ తేదీ, రకం, ఇలా అన్ని వివరాలు కలిగి ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారుల నుంచి తప్పని సరిగా పొందాలి. సంచులపై సీలు విప్పినట్లు లేదా, విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే అలాంటి వాటిని తీసుకోరాదు. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తనబస్తాతో లభించే చీటీ(ట్యాగ్) ఉందో లేదో గమనించి, ఉన్నది మాత్రమే తీసుకోవాలి. ఆ చీటీని ఏడాదిపాటు భద్రంగా ఉంచుకోవాలి. నకిలీవి అని అనుమానం వస్తే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. ఉచితంగా నకిలీ నిర్ధారణ పరీక్షలు చేయించవచ్చు. లైసెన్సు లేకుండా విత్తనాలు ఎరువులు మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలి.

అనుమతులు లేని మందులను విక్రయిస్తే చర్యలు

విత్తనాలు, ఎరువుల దుకాణదారులు అనుమతులు లేని మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలను కొనుగోలు చేసి, రైతులు మోసపోరాదు. బ్యాచ్ నెంబర్ లేని పురుగు మందులు కొనుగోలు చేయరాదు. విత్తనాలు, ఎరువులు కొనుగోలులో ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు కచ్చితంగా దుకాణదారుడి నుంచి బిల్లు తీసుకోవాలి.

– మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మంత్రాలయం : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ నూర్జహాన్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ..యోగా శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, యోగాపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో యోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని సూచించారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన సుఫియాన్

కౌతాళం: మండల కేంద్రంలో మూడు సంవత్సరాల బాలుడిపై శుక్రవారం కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాలుడి తల్లిదండ్రులు ఖురేషీ సలీం, ఫిర్దోస్ తెలిపిన వివరాల మేరకు తమ కుమారుడు సుఫియాన్ ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కల గుంపు ఒక్కసారి దాడి చేశాయి. కాలనీ వాసులు గమనించి కుక్కలను తరిమి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. తలపైభాగంలో కుక్క కాట్లు కనిపించడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. అలాగే చేతికి గాయాలు తీవ్రంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తీసుకెళ్లారు.

ఇండోర్ స్టేడియాన్ని పూర్తి చేయండి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని కిష్టప్ప నగర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు శశిధర్ కోరారు. శుక్రవారం నిర్మాణం నిలిచిన స్టేడియాన్ని ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించింది. వారు మాట్లాడుతూ 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆర్టీసీ బస్టాండు వెనక విల్లా కిష్టప్ప నగర్‌లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ 2017–18 ఎన్టీఆర్ క్రీడా వికాస్ కేంద్రం పేరుతో స్టేడియం నిర్మాణాన్ని2018 ఫిబ్రవరిలో ప్రారంభించారన్నారు. దాదాపు ఐదేళ్ల నుంచి మొండి గోడలకే పరిమితమైందని, కూటమి ప్రభుత్వం స్పందించి పనులను ప్రారంభించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శివ, వెంకట్, ఉచ్చీరప్ప, ఉత్తేజ్, వినయ్, శివ, రాజు, వీరేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన సమ్మెలో భాగంగా నిరవధిక దీక్షలో కూర్చున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు శుక్రవారం వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

9న టైలర్ల సభ

గోనెగండ్ల: ఈనెల 9న మండల కేంద్రంలో నిర్వహించే టైలర్ల అసోసియేషన్ సభను జయప్రదం చేయాలని టైలర్ల సంఘం అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నజీర్ అహమ్మద్, మండల అధ్యక్షుడు నరసింహులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సభలో టైలర్ల సమస్యలు, రానున్న రోజుల్లో టైలర్ల సంక్షేమం కోసం తీసుకునే నిర్ణయాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

జననీ యాత్ర ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డా.ఎ.మధుసూదన్

ఆదోని సెంట్రల్: మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒయాసిస్ ఫెర్టిలిటీ చేపట్టిన 'జనని యాత్ర'లో భాగంగా ఆదోనిలో ఉచిత ఫెర్టిలిటీ అవగాహన క్యాంపు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై మొబైల్ ఫెర్టిలిటీ బస్సును ప్రారంభించారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆరోగ్య సేవల్ని అందించడంలో ఒయాసిస్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ సైంటిఫిక్ హెడ్, క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డా.కృష్ణచైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించండి



రైతులతో మాట్లాడుతున్న వేదమణి

ఆదోని రూరల్: ఖరీఫ్‌లో భాగంగా రైతులు పంటల సాగులో ఆధునిక విధానాలతో పాటు మెలకువలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వేదమణి సూచించారు. మండలంలోని దొడ్డనగేరి గ్రామంలో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రైతులు నూతన సాంకేతిక సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా మంచి దిగుబడులతో పాటు పెట్టుబడి ఆదా అవుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త డా.వై.మౌనిక మిరప, ఉల్లి, పత్తి పంటల యాజమాన్య పద్ధతులు, వాటికి సోకే తెగుళ్లు, పురుగుల నివారణ గురించి తెలియజేశారు. అలాగే వ్యవసాయ విస్తరణాధికారి గీత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాల గురించి రైతులకు వివరించారు. అనంతరం సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఆత్మ సిబ్బంది రామాంజనేయులు, వీఏఏలు లోకేష్, సంజీవ్, ఎంపీఈఓ భారతి పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు జయంతి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: సీపీఐ అగ్రనేత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతిని స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు, సీనియర్ నాయకుడు కె.లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ పేద బడుగు, బలహీనవర్గాల ప్రజల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ తన ఆస్తిని పార్టీకి అంకితం చేశారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ, మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావిరాజు, సహాయ కార్యదర్శి విజయ్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు గంగన్న, రైతుసంఘం నాయకులు మదిరి ఎల్లప్ప పాల్గొన్నారు.

క్షయ వ్యాధి పట్ల అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈఓ

ఎమ్మిగనూరుటౌన్: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని ఎంపీహెచ్ఈఓ విజయకృష్ణ, డాక్టర్ వీణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మల్లారి వీధిలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీబీ రహిత దేశంగా మార్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. రెండు నెలలకు మించి జ్వరం, దగ్గు, గళ్ల పడటం, గళ్లలో రక్త చారాలు రావడం, బరువు తగ్గడంతో పాటు ఆకలి మందగించటం లక్షణాలుంటూ వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే డాక్టర్ల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడి నయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్ వైజర్ సుమలత, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

- **నందవరం:** మండల పరిధిలోని కే.పేట సచివాలయ–2లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు గ్రామస్తులకు టీబీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేఖ పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం రూరల్ : క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కల్లుదేవకుంట పీహెచ్‌సీ డాక్టర్ గోవిందమ్మ సూచించారు. శుక్రవారం మంత్రాలయంలోని సచివాలయం–3లో వైద్యాధికారులు, సిబ్బందితో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా టీబీ వ్యాధిగ్రస్తులు, బీపీ, షుగర్, మద్యపానం, ధూమపానం సేవించే వారికి గళ్ల పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..50 మందికి టీబీ పరీక్షలు చేశామన్నారు. టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు కూడా గళ్ల పరీక్షలు చేశామని చెప్పారు. పీహెచ్‌ఎన్ రాణి, టీబీ సూపర్‌వైజర్ చాంద్‌బాషా, ఏఎన్ఎం సుజాత, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఈద్ ఉల్ జహ ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక నమాజుకు ఈద్గా పరిసరాలను సిద్ధం చేసిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఈద్గా, మసీదుల్లో ఈద్ ఉల్ జహ(బక్రీద్) పురస్కరించుకుని శనివారం ప్రత్యేక నమాజులకు ముస్లింమత పెద్దలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా స్టేట్ బ్యాంక్ వద్దనున్న జమాతేఏ అలెహదీస్ ఈద్గా, కర్నూలు రోడ్డులోని మొహమ్మది మసీదులో ఉదయం 6.30 గంటలకు, శిల్పా ఎస్టేట్‌లోని మసీదే ఏ అర్సా, శివ సర్కిల్‌లోని అబుబకర్ మసీదులలో ఉదయం 6.45, మసీదే మహమ్మదీయ, నూరాని మసీదు, లక్ష్మీపేటలోని మక్కా మసీదు, అయేషా మసీదు, ముగతి పేట మీన మసీదు, సుల్తాన్ మసీదులలో 7, గోనెగండ్ల రోడ్‌లోని హఫీజ్ మసీదు, చున్నంబట్టి బిలాల్ మసీదు, ముగతి మొహల్ల మసీదు, ఎస్ఎంటీ కాలనీ మదీన మసీదులలో ఉదయం 7.30, కమిటీ రోడ్డులోని ఈద్గాలో 8, షరాఫ్ బజార్‌లోని జామియా మసీదులో 8.30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని ముస్లిం మత పెద్దలు తెలిపారు.